www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 డిసెంబర్ 2022
5
అన్నమయ్య

వుడ్‌బాల్ పోటీల్లో జ్ఞానాంబిక విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కర్నూల్ లో ఇటీవల జరిగిన సౌత్ జోన్ వుడ్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జ్ఞానాంబికా కళాశాల విద్యార్థిని వి.పద్మశ్రీ విన్నర్‌గా నిలిచిందని కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్ తెలిపారు. మిక్స్ డబుల్స్ పోటీల్లో పాల్గొన్న పద్మశ్రీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విన్నర్‌గా నిలిచిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య వద్ద నిర్వహించిన జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు జయపాల్ రెడ్డి, హేమంత్ కుమార్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ ఎస్.రమాదేవి, పీడీ శరత్ నాయక్ విద్యార్థులను అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ గురుప్రసాద్

ఆశావాహుల్లో ఉత్కంఠ!

- పొలిటికల్ సర్వేలతో తెలుగు తమ్ముళ్లలో గుబులు
- గడప గడపకూ ప్రభుత్వ సమీక్షలతో వైసిపి నేతలు ఉక్కిరిబిక్కిరి
- మైదుకూరు, రాజంపేట, రైల్వేకోడూరులపై టిడిపి కన్ను

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలవడం ఆషామాషీ వ్యవహారం కానేకాదు. 2024 సార్వత్రిక ఎన్నికలకు అసెంబ్లీ టికెట్ లభించడం అనేక వడపోతల అనంతరం పర్యవసానంగా మారడం ఆశావహులకు సవాల్ విసురుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని సిట్టింగ్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్న వారికీ సవాల్‌గా మారింది. వైసిపి ఏడాదిగా గడప గడపకూ ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను తెలుసుకుని వ్యతిరేకతను తగ్గించుకున్న నేతలకు మళ్లీ టికెట్లను కేటాయించనున్నట్లు ప్రకటించడం తెలిసిందే. ప్రతిపక్ష టిడిపి సైతం పొలిటికల్ ప్రొఫెనలిస్టు రాబిన్‌సింగ్ బృందానికి టికెట్లపై సర్వేలు నిర్వహించడం తమ్ముళ్లలో గుబులు రేపుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్ష టిడిపి తరుపున రాబిన్‌సింగ్ బృందం సర్వేలు, సమీక్షలు నిర్వహిస్తుండడం పొలిటికల్ హీట్‌ను పెంచింది. ఇటీవల రాజంపేట అసెంబ్లీ పరిధిలో వరుస సమావేశాలు, సమీక్షలు చేసిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల ముంగిట టిడిపి అధ్యక్షులు ప్రొఫెలిస్టుల సర్వేల పట్ల అధికార వైసిపిని హేళన చేసిన ఫలితమే దారుణ పరాజయానికి దారితీసిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష టిడిపి సైతం టికెట్ల ఎంపికలో పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల వైపు మొగ్గుచూపింది. రాబిన్‌సింగ్ బృందం ఉమ్మడి జిల్లాలోని ఆయా అసెంబ్లీ, పార్ల మెంటరీ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు, ఆశావహులకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ ప్రాతిపదికగా సర్వేలు చేసి ఇచ్చిన నివేదిక ఆధారంగా టికెట్లు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వరుస పర్యటనలు షురూ

టిడిపి అధ్యక్షులు చంద్రబాబు జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు ప్రాంతాల్లో నిర్వహించిన బాదుడేబాదుడు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిన సంగతి తెలిసిందే. ఇటీవల పొద్దుటూరు టిడిపి నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అరెస్టు వ్యవహారం సందర్భంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటన పొద్దుటూరు అభ్యర్థిగా ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాలకు రెండు, మూడు పర్యాయాలు పర్యటించాలని నిర్ణయించారు. జిల్లాలో పలు దఫాలుగా పర్యటిస్తున్నారు. గత ఆగస్టులో నియోజకవర్గాల వారీ సమీక్షలో రాజంపేట, మదనపల్లి అసెంబ్లీ పరిధిలో గట్టి సవాల్ ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించి, సత్వరమే దిద్దుబాటు చేసుకోవాలని హెచ్చరించడం గమనార్హం. టిడిపి వైసిపికి ధీటుగా ప్రాంతాల వారీగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నతీరు రాజకీయంగా చర్చ నీయాంశంగా మారింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడా దిన్నర సమయం ఉండగానే జిల్లాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది.

కొన్నిచోట్ల పోటాపోటీ వాతావరణం

జిల్లాలో ప్రధానంగా కడప, రాజంపేట, మైదుకూరు, రైల్వేకోడూరు, మదనపల్లి అసెంబ్లీల పరిధిలో పోటాపోటీ వాతావరణం నెలకొనే అవకాశం ఉందని పరిశీలకుల అంచనాలు ఉన్నాయి. రాజంపేటలో టిడిపి ఇన్‌ఛార్జిగా బత్యాల చెంగల్రాయులు ఉన్నారు. ఈయన వైసిపి అభ్యర్థి నాయకత్వానికి ధీటైన వ్యక్తిగా నిలిచారు. సామాజిక, ఆర్థిక బలాబలాలే గెలుపునకు దోహదం చేసే అవకాశాలు ఉన్నాయి. మైదుకూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా సుధాకర్‌యాదవ్ సమర్థ నాయకత్వం ఉంది. ఈయనకు టికెట్ కేటాయించి ప్రణాళికాబద్ధంగా సహాయ సహకారాలు అందిస్తే గెలిచే అవకాశాలను కొట్టిపారేయలేని పరిస్థితి. రైల్వేకోడూరుకు టిడిపి సరైన అభ్యర్థిని రంగంలోకి దించితే పొత్తు అవకాశాల నేపథ్యంలో ఆశించిన ఫలితాలు రావొచ్చనే వాదన వినిపిస్తోంది. మదనపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించని నేపథ్యం అధికార పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఇటువంటి అవకాశాన్ని సరైన అభ్యర్థి ఎంపిక, వ్యూహాత్మక ప్రచారం ద్వారా సాధించుకునే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీలను వైసిపి క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్ష టిడిపి, జనసేన, బిజెపి పొత్తు కుదిరితే ఉమ్మడి జిల్లాలోని ఐదు అసెంబ్లీల పరిధిలో అధికార పార్టీకి పోటీనిచ్చే అవకాశాలు ఉంటాయనే అంచనాలు ఉన్నాయి. ఏదేమైనా పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల నివేదిక ఆధారంగా టికెట్లు కేటాయించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఆశావహుల్లో ఎవరికి టికెట్ లభించనుందోననే ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో మాండూస్ తుఫాన్ అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రజల అప్రమత్తంపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళా ఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ ప్రభావంతో జిల్లాల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 60 నుంచి 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఆవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మూడు రోజులు నదులు, వాగులు, వంకలు పరిసర ప్రాంతాలకు వెళ్ళద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉధృతంగా ప్రవహించే నదులు, వాగులు, వంకల్లోకి దాటేందుకు సాహసం చేయొద్దన్నారు. గత సంవత్సరం నవంబర్ చివరన భారీ వర్షాలు జిల్లాలో కురిశాయిన్నారు. ఈసారి కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి, ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ శాఖ చెప్పడం జరిగిందన్నారు. మండూస్ తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ఇబ్బంది ఉన్న జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ 08561-293006 నంబర్‌కు సమాచారం అందివ్వాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయండని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, అన్నిచోట్ల కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామన్నారు. మండూస్ తుఫాను పట్ల అధికారులందరూ అప్రమత్తంగా ఉండడంతోపాటు జిల్లా, డివిజన్, మండల కేంద్రాలలో అందుబాటులో ఉండాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు కూడా ఆయా గ్రామాలలో అందుబాటులో ఉండాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. అధికారులందరూ స్టాండర్డ్ ప్రొసీజర్స్ తప్పక పాటించాలని సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. గత సంవత్సరం కురిసినట్లు భారీ వర్షాలు కురిస్తే రోడ్లు, చెరువులు, విద్యుత్, వాటర్ సప్లై 24 గంటల్లోగా మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. వర్షాలు ఎక్కువగా వస్తే పరిస్థితి బట్టి పాఠశాలలను కూడా సెలవులు ప్రకటించడం జరుగుతుందన్నారు. నదిపరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం పునరావాస కేంద్రాలు సిద్ధం చేసామన్నారు. వరద ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు మరమ్మతులు, సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులను సిద్ధం చేశాం అన్నారు. వరద ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో డిఆర్ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

అంబేద్కర్ విగ్రహాన్ని యధాస్థానంలో ప్రతిష్టించాలి

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటిలో తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో అంబేద్కర్ విగ్రహాన్ని యధాస్థానంలో ఉంచే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జిల్లా ప్రజాసంఘాల జెఎసి నాయకులు పేర్కొన్నారు. గురువారం అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే తిరిగి ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి సందర్శించి తన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పథకం ప్రకారం అంబేద్కర్ విగ్రహాన్ని మాయం చేశారని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు ఇంత వివాదాస్పదం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలకులు పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నేరానికి పాల్పడిన వారిని పై కేసు నమోదు చేసి తిరిగి విగ్రహాన్ని తొలగించిన స్థానంలో ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో తానే స్వయంగా కాశ్య విగ్రహాన్ని ఇస్తానని ఆయన నిరాహార దీక్ష శిబిరంలో ప్రకటించారు. నిరాహార దీక్షలో ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజనేయులు, ఒపిడిఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, పౌర హక్కుల సంఘం నాయకుడు రెడ్డయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజనేయులు, నరసింహులు, సిద్దిగాల శ్రీనివాసులు, ఏపీ వడ్డెర విద్యావంతులు వేదిక నాయకులు మారుతి శంకర్, చల్లా రెడ్డయ్య, వల్లెపు శ్రీరాములు,రజక సంక్షేమ సంఘం నాయకులు రమేష్, శ్రీనివాసులు రమణ, బీఎస్పీ నాయకులు నాగార్జున యుగంధర్, ఆంజనేయులు లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు శంకర్ నాయక్, ఓపిడిఆర్ నాయకులు అక్బర్ భారత నాస్తిక సమాజం రాయలసీమ అధ్యక్షులు పల్లం తాతయ్య, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజులు ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి

సిఎం సమక్షంలో వైసిపిలో చేరిన శ్రీనాథరెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్‌రెడ్డి వైసిపిలో చేరారు. గురువారం మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీకి గుడ్ బై చెప్పి సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా వైసిపి కండువా కప్పుకున్నారు. శ్రీనాథ్‌రెడ్డితో పాటు వైసిపిలో చేరిన వారిలో పీలేరు నియోజకవర్గ టిడిపి నేతలు జివి రాకేష్‌రెడ్డి, ఎం.వెంకట కృష్ణారెడ్డి, వి.ఉమాకాంత్ రెడ్డి, బి.నరేందర్ రెడ్డి, జి.నరేష్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, పీలేరు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష పాల్గొన్నారు.

పౌరహక్కుల సభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రారంభమై 50 ఏళ్ల సందర్భంగా ఈ నెల 24న గుంటూరులో ప్రారంభ మహా సభలను జయప్రదం చేయాలని తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త క్రాంతి చైతన్య తెలిపారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాజ్య హింస అమలు చేస్తున్న తరుణంలో ప్రజా ఉద్యమకారుల పైన, ప్రజా ఉద్యమాల పైన మాలపైన ముఖ్యంగా నక్సలైట్ ఉద్యమంపై అలనాటి జలగం వెంగళరావు ప్రభుత్వం అమ్ములు చేసిన కూర నిర్బంధనానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులు మేధావులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి థాంక్యూ వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పౌరుహక్కుల సంఘం రాజ్యహింసకు వ్యతిరేకంగా మాత్రమే కాకుండా అనేక అంశాల పైన తన గొంతును వినిపిస్తుందన్నారు. కార్యక్రమంలో బాస్ నాయకులు శ్రీనివాసులు, మల్లేష్, జీవీ రమణ పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్‌కి నిలయంగా రాష్ట్రం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు జగన్‌రెడ్డి పాలనలో గంజాయి, డ్రగ్స్‌కి నిలయంగా మారిందని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీలో డ్రగ్స్ దందాను 'స్మగ్లింగ్ ఇన్ ఇండియా' నివేదికలో కేంద్రం బట్టబయలు చేసిందన్నారు. టిడిపి హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్, ఎంజీఎన్.ఆర్.ఈజీఎస్ పనులు వంటి వాటిలో ఏపీ మొదటి స్థానంలో ఉండేదన్నారు. నేడు గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నాదెండ్ల అరుణ్, తంబాలపల్లి నియోజకవర్గ అధ్యక్షులు సాయినాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, మదనపల్లి పట్టణ అధ్యక్షులు ప్రణయ్ రాయల్, బాలకృష్ణ, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

గోదాముల ఏర్పాటుకు స్థలాన్ని ఎంపిక చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోదాముల ఏర్పాటుకు వేగంగా స్థల ఎంపిక చేయాలని అధికారులను ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎమ్‌డి అహ్మద్ బాబు ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్ ల్యాండ్ అలాట్మెంట్ తదితర అంశంపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి కలెక్టర్ గిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్‌డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడవ విడత కింద నిర్మించనున్న ఎంపిఎఫ్‌సి గోడౌన్లకు అవసరమైన స్థల పరిశీలన వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో 140 ఎంపిఎఫ్‌సి గోడౌన్లను మూడవ విడత కింద నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని, వాటికి సంబంధించి కొన్ని జిల్లాల నుండి స్థల ప్రతిపాదనలు ఇంతవరకు అందలేదని తెలిపారు. వీటిపై జేసిలు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన స్థల పరిశీలన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆశయం సిద్ధించేలా అధికారులందరూ చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, డిఎఒ సి గురుప్రకాష్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి గుణశేఖర్ పిళ్ళై పాల్గొన్నారు.

ఖాన్ డ్రై ఫ్రూట్స్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

స్థానిక మక్కా మసీద్ ఎదురుగా ఉన్న కూరగాయల మార్కెట్‌లో బేపారి అనస్‌ఖాన్ ఏర్పాటు చేసిన ఖాన్ ఎంటర్‌ప్రైజస్ (హోల్‌సేల్ డ్రై ఫ్రూట్) గురువారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహమాన్, వైసీపీ మైనార్టీ నాయకులు బెపారి మహమ్మద్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యతతో పాటు సరసమైన ధరలకే డ్రై ఫ్రూట్స్ విక్రయించి వినియోగదారుల మన్నలను పొందాలన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సలర్ అన్నా సలీమ్, మాజీ మార్కెట్ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, బెపారి జబీ బుల్లా ఖాన్, బెపారి అసద్ ఖాన్, మొయినుద్దీన్, కొత్తపల్లి ఇంతియాజ్, ఖదీర్ పాల్గొన్నారు.

దుకాణం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నేతలు

నూతనంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రశాంతంగా ఎన్‌జిఒ సహకార సంఘం ఎన్నికలు

రాయచోటి :ఎన్‌జిఒ తాలూకా సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి కె.వి. ఃవరప్రసాద్ గురువారం తెలిపారు. పట్టణంలోని పట్టణంలో ఎన్‌జిఒ కాలనీలో అధ్యక్షులుగా ఎం మధుసూదన్‌రెడ్డి మాత్రమే దాఖలు వేసినట్లు తెలిపారు. ఉపాధ్యక్ష వెంకటేశ్వర రెడ్డి నామినేషన్లు వేశారున్నారు. పోలింగ్ అనంతరం జయచంద్ర గెలిపొందినట్ల పేర్కొన్నారు పాలక వర్గానికి 7 స్థానాలు అవసరం కాగా ఏడుగురు మాత్రమే నామినేషన్ ధాఖలు చేశారున్నారు. ఎవరు ఉపసంహరించనందున ఎన్నుకల అధికారి సంఘ పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెప్పారు. అధ్యక్షునిగా మధుసూధనరెడ్డి, ఉపాధ్యక్షులుగా జయచంద్ర, డైరెక్టరులుగా వెంకటేశ్వర, రాజా, దేవేంద్ర, సిద్దయ్య, ప్రసాద ఎన్నికయ్యారు అన్నారు. నూతనంగా ఎంపికైన వారిని జిల్లా అధ్యక్షులు ఎరపరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

12 నుంచి సైన్సు ఎగ్జిబిషన్

రాయచోటి : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నెల 12, 13 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాలలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిరహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రదర్శన నిర్వహించి థీమ్‌కు ఒకటి చొప్పున ఐదు ప్రాజెక్టులను ఎంపిక చేశామని చెప్పారు. అన్ని యాజమాన్యాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మండల స్థాయి ఎగ్జిబిషన్‌లో ఐదు ప్రాజెక్టుల చొప్పున ప్రదర్శించాలన్నారు. అన్ని పాఠశాలలు తప్పనిసరిగా ఎగ్జిబిషన్లో పాల్గొని మండల స్థాయి ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

వ్య.కా.స రాష్ట్ర మహాసభల్లో ప్రతినిధులుగా పాల్గొన్న జిల్లా నాయకులు

రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో 8, 9, 10వ తేదీలలో జరుగుతున్న సభకు అన్నమయ్య జిల్లా నుండి బుధవారం 12 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి శ్రీనివాసులు మాట్లాడుతూ భూమి పంచి ఉపాధి కల్పించాలని ఉపాధి హామీని రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని కనీస వేతనం 600 ఇవ్వాలని ఇతర నినాదాలతో ప్రజల పోరాటాలకు సిద్ధపడాలని కోరుతూవ్యవసాయ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పందికాళ్ల మనీ, జయరామయ్య, శివయ్య, సుధాకర్, వెంకటమ్మ బాలకృష్ణ పాల్గొన్నారు.

మల్లికార్జునకు సమాజ సేవా పురస్కార్ అవార్డు

రాయచోటి టౌన్: ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిస్వార్ధంగా సమాజానికి సేవ చేస్తున్న 144 స్వచ్ఛంద సంస్థలకు, వ్యక్తులకు పురస్కారాలు ప్రకటించిన సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునను ఎంపిక చేశారు. పురస్కారాన్ని ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం రోజు నెల్లూరులో పురస్కారాన్ని భారత కేంద్ర వ్యవహారాల మంత్రిత్వ శాఖ శ్రీనివాసరెడ్డి, ఐఎఫ్ఎస్, ఎపి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గోవర్ధన్ రెడ్డి, మానవ హక్కుల సంఘం జాతీయ చైర్మన్ సుబ్బారెడ్డి చేతుల మీదుగా అందజేస్తారు. సేవలను గుర్తించి అవార్డులకు ఎంపిక చేసిన సంస్థ ప్రతినిధులకు అధికారులకు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత : ఎఒ

వాల్మీకిపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శేషగిరి అన్నారు. గురువారం మండలంలోని చింతపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ఆరోగ్య కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నాప్కిన్స్, ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాలలో చిక్కీలు ఇస్తున్నారా వాటిని తింటున్నారా అని అడిగి తెలుసుకొని, చిక్కీ వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రతి ఒక్కరూ పాఠశాలలోనే తినేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు మానస, శ్రీవిద్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫి, హెచ్ఎం సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ సుధాకర్, పూర్ణమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శేషగిరిబాబు

భూ హక్కు పత్రాలు పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - రాయచోటి

రీసర్వే పూరైన గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదేశించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి సంబందిత శాఖల కార్యదర్శులతో కలిసి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యాచరణ, అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీషా పిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వారాల తరబడి వాయిదాలు వేయకుండా మిగిలిన రీసర్వే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే చేస్తున్నప్పుడు ఉత్పన్నమైన సమస్యలను అత్యంత ప్రణాళికా బద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలని, ప్రజలను పూర్తిస్థాయిలో సంతృప్తి పరిచేలా, వారి భూ సమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారాలు చూపేలా రీసర్వే ఉండాలన్నారు. ఈ సర్వే ద్వారా రెవెన్యూ వ్యవస్థ పూర్తి స్థాయిలో ప్రక్షాళన అవుతుందని, రికార్డులు, డేటా అంతా స్వచ్ఛీకరణ జరుగుతుందని చెప్పారు. ఈ అంశాలను అధికారులు దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని సూచించారు. రీ సర్వే అనంతరం కొలత రాళ్ల పని పూర్తిచేయాలని సూచించారు. సమగ్ర సర్వే పూర్తయిన గ్రామాల్లో భూహక్కుదారులకు జగనన్న భూహక్కు - భూరక్ష పత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని, మరో వారంలో 22 వేల పత్రాలు జారీచేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిర్ణీత గడువులోగా మ్యుటేషన్లను తీసుకోవాలని, ఇప్పటివరకు పెండింగులో ఉన్నవాటిపై ఎప్పటికపుడూ చర్యలు చేపట్టాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్, 9-2 నోటీసులు, 22-ఏ లేయర్ చాలా గ్రామాల్లో త్వరగా పూర్తిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఫ్యూరిఫికేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ కొన్ని గ్రామాల్లో పికప్ చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణ, భూముల సర్వే విభాగం సహాయ సంచాలకులు జయరాజ్ పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, డిఆర్ఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దస్తగిరి

అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేయండి : ఎంపిపి

ప్రజాశక్తి-కురబలకోట

గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2023-24 సంవత్సరానికి సిద్ధంచేయాలని గ్రామపంచాయతీ సెక్రటరీలకు ఎంపిపి దస్తగిరి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళికపై శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు ఏం చేశాం, ఏఏ పనులు చేయాలనేదానిపై పూర్తి స్థాయిలో ప్రణాళిక ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ శిక్షణా కార్యక్రమం సర్పంచులకు, ఎంపిటిసిలకు, పంచాయతీ కార్యదర్శులకు డిజిటల్ అసిస్టెంట్లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకొని సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని సూచిం చారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ దిలిప్ కుమార్, ఎంఇఒ ద్వారాకనాథ్ అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, విస్తరణాధికారి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

ప్రజాశక్తి -నిమ్మనపల్లి

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు జలజీవన మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించాలని పంచాయితీ రాజ్ కో-ఆర్డినేటర్ రాధా రాణి తెలిపారు. గురువారం రాచవేటివారిపల్లి సచివాలయంలో సర్పంచ్ సుబ్రమణ్యం అధ్యక్షతన జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టవలసిన పనుల ఎంపికపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజానీకానికి శుద్ధమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యం మేరకు గ్రామాల్లో చేపట్టవలసిన పనులను గుర్తించి ప్రణాళికలను సిద్ధం చేయాలని అన్నారు. త్రాగునీటి బోర్ల మరమ్మతులు, కొత్త బోర్లు ఏర్పాటు చేయడం, పైపులైన్లను ఏర్పాటు చేయటం, ఇళ్లకు నీటి కొళాయిలను ఏర్పాటు చేయటం వంటి కార్యక్రమాలను వెంటనే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో త్రాగనీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి రెడ్డి వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ హరినాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పునీత్‌రామ్‌కు మొమెంటో అందిస్తున్న అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్

బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో విస్డమ్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని కరెస్పాండెంట్ డాక్టర్ టి.ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నవంబర్ నెల 29, 30వ తేదీలలో గోవాలో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలలో ఎం.పునీత్‌రామ్, ఎం.రేవంత్, ఎం.జశ్వంత్, ఎన్.అభయ్‌రామ్‌లు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. వీరిలో పునీత్ రామ్ జాతీయ స్థాయిలో ఉత్తమ స్కేటింగ్ అవార్డు సాధించి వచ్చే నెలలో మలేషియాలో జరిగే ప్రపంచ స్థాయి పోటీలకు అర్హత సాధించాడని అన్నారు. స్థానిక అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ ఆ విద్యార్థిని అభినందించి మెడల్స్ బాహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టి. మదన్మోహన్, ప్రిన్సిపల్ టి.ప్రియాంక, వ్యాయామ ఉపాధ్యాయులు అమర్నాథ్, షబ్బీర్‌అలీ, శివకుమారి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాన సేవా ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి - నందలూరు

ప్రసిద్ధిగాంచిన సౌమ్యనాథ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న సౌమ్యనాథ అన్నదాన సేవా ట్రస్టుకు బస్టాండ్ కూడలిలో నివాసమున్న దుకాణంయజమాని గండికోట సుబ్బరాయుడు, రాజేశ్వరి దంపతులు లక్ష రూపాయలు విలువైన మండపమును ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు గురువారం అందజేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో సుబ్బరాయుడు దంప తులకు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దాత బంధువులు పాల్గొన్నారు.

మల్లెలలో ఎమ్మెల్యేకి సమస్యను వివరిస్తున్న మహిళలు

ప్రతి కుటుంబానికీ అండగా ఉంటాం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -ములకలచెరువు

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వైసిపి ప్రభుత్వం ఉండగా ఉంటుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మల్లెల పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధి సమాచారం పొందు పరిచిన బుక్కులను అందజేశారు. పలువురు మహిళలు గృహ నిర్మాణానికి ప్రభత్వం ఇస్తున్న డబ్బు సరిపోవడం లేదని అన్నారు. ఇళ్ల మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పాటు డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు ఇందిస్తామన్నాని చెప్పారు. పునాదులు వేస్తే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు అధికారులు లెక్కిస్తారన్నారని పేర్కొన్నారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వం ఇళ్లను రద్దు చేస్తుందని మహిళలకు ఎమ్మెల్యే హితబోధ చేశారు. ఏనుగు దలవారిపల్లిలో ఇప్పటి వరకు ఒక్క మీటర్ సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపట్ట లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. అనంతరం రాపూరి వారి పల్లి గ్రామంలో పర్యటించారు. కార్య క్రమంలో జెడ్పీటీసీ శివన్న ఎంపిపి మహమూద్, సర్పంచు శ్రీకంట రెడ్డి, మాజీ సర్పంచి వెంకట్ ఆంకిరెడ్డిపల్లి కృష్ణారెడ్డి తహశీల్దార్ విద్యాసాగర్ , ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి , ఎపిఎం సాంబశివ జెఇలు హరి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండలంలోని శంకరాపురం వద్ద వెలసిన బండెన్న స్వామి ఆలయంలో 125 దేవతా విగ్రహాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు. గురువారం తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు లక్ష్మీపతి స్వామి మాట్లాడుతూ ప్రతి ఏడాది మహాశివరాత్రి వేడుకలను ఇక్కడ ఎంతో ఘనంగా జరుపుకునే సంగతి భక్తులకు తెలిసిందేనన్నారు. ప్రతి సోమవారం , శుక్రవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల కోసం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. .భక్తులు, దాతల సహకారంతో భవిష్యత్తులో మరింత వైభవంగా ఆలయం తీర్చిదిద్దుతామని తెలిపారు.

మూలనపడ్డ రిక్షా బండ్లు.. పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

చెత్తను తరలించే రిక్షాబండ్లు మూలన పడటంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తా చెదారం, కుళ్లిన వ్యర్థాలు పేరుకపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మూలనపడ్డ రిక్షాబండ్లకు మరమ్మత్తులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కుళ్లిన వ్యర్థాల ద్వారా దోమలు స్వైరవిహారం చేయడంతో విషజ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓబులవారిపల్లి మండలంలో పంచాయతీ అధికారులు నెలకు ఒకసారి పంచాయతీలలో పర్యవేక్షించి పారిశుధ్యం, వీధిలైట్లు, వృద్ధాప్య పెన్షన్ గ్రామ సమస్యలపై స్పందించి న్యాయం చేస్తున్నారని ఇక్కడ అటువంటి పరిస్థితి లేదని ప్రజలు చెప్పుకుంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. అకాలవర్షంతో రోడ్లపై నీరు నిలిచిపోయి అసౌకర్యంగా ఉందని అధికారులు స్పందించి శుభ్రత చర్యలు చేపట్టాలని కోరారు. చెత్తను తరలించే రిక్షాబండ్లను త్వరితగతినగ మరమ్మత్తులు చేయించి, గ్రామాలలో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

మూలనపడ్డ రిక్షా బండి

మహాసభలకు తరలిరండి : సిఐటియు

మహాసభల పోస్టర్ విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 23, 24 తేదీలలో రాయచోటి పట్టణంలో నిర్వహించే సిఐటియు ప్రథమ మహాసభలకు జిల్లాలోని అన్ని కార్మిక వర్గాలు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు కార్యదర్శి ఏ.రామాంజులు పిలుపునిచ్చారు. లక్కిరెడ్డిపల్లి బాలసదనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు రక్షణగా ఉన్న 44 చట్టాలను 4 చట్టాలుగా మార్చి కార్మికులను దోపిడీ చేస్తోందన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు ముసుగులో కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమ్మెలు సంఘాలు వద్దని బెదిరించి అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడు తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 72 రకాల జివోలను కాల పరిమితి ముగిసినా సవరించలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిని రద్దు చేస్తామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి మాట తప్పారని అన్నారు. మహాసభల్లో అన్ని కార్మిక వర్గ సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన మండల కార్యవర్గం ఎన్నుకున్నామన్నారు. మండల అధ్యక్షులుగా జేసుకుమారి, ప్రధాన కార్యదర్శిగా ఎం.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా గంగాధర్ సహాయకార్యదర్శిగా శ్రీనాథ్, కోశాధికారి శారద, మురారిలను సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే ధ్యేయం : 'కొరముట్ల'

ప్రజాశక్తి- పుల్లంపేట

రైతుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు.గురువారం మండల పరిధిలోని అనంతయ్య గారి పల్లె గ్రామంలో జగనన్న శాశ్వత హక్కు - భూ రక్ష పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారమే జగనన్నభూ రక్షా అని భూ హక్కుతో రైతులు శాశ్వత ప్రాతిపదికన ప్రయోజనాలు పొందవచ్చని అన్నారు. భవిష్యత్తులో భూ వివాదాలకు తావు లేకుండా అత్యంత పారదర్శక విధానంలో భూహక్కు పథకాన్ని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అన్ని రెవిన్యూ గ్రామాలలో పారదర్శకంగా రీసర్వే చేసి భూ యజమానులకు పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం సంబంధిత ఆర్‌డిఒ, తహశీల్దార్ లను సంప్రదించవచ్చునని ఆయన తెలిపారు. భూ హక్కు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ల కోసం ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. మనదేశంలో తొలిసారిగా సమగ్ర భూముల రీ సర్వే చేపట్టిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన శాశ్వత భూహక్కు పథకం ద్వారా దళారీ వ్యవస్థను పారద్రోలడమే కాకుండా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా భూములు రీ సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలో కార్స్ టెక్నాలజీ వినియోగించి అస్తవ్యస్తంగా ఉన్న భూ రికార్డులను సరి చేసినట్లు చెప్పారు. భూముల విస్తీర్ణం ప్రకారం రికార్డులు తయారు చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహ కుమార్, ఎంపిడిఒ ప్రకాశం, నియోజవర్గం ఇంచార్జి కొల్లం గంగిరెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, రాజారెడ్డి, రామ్ భూపాల్ రెడ్డి, కార్తీక్ , రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపాలి : సిఐ

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

అంగవైకల్యం అనేది మనిషి శరీరానికే కానీ మనసుకు కాదని, విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యం నింపాలని పీలేరు అర్బన్ సిఐ ఎన్ మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో సహిత విద్య, పాఠశాల ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంత పిల్లలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐ మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి, వారిలోని ప్రత్యేక నైపుణ్యాలను ప్రోత్సహిం చాలని అన్నారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఓబయ్య మాట్లాడుతూ మేనరిక వివాహాలకు స్వస్తి పలికి అంగవైకల్య జననాలను నియంత్రించాలని పేర్కొన్నారు. మేనరిక వివాహాలు చేసుకున్న వారు గర్భం దాల్చిన మూడు నెలల లోపు రేడియాలజీ, టిఫ్ఫా స్కానింగ్ చేసుకుని, గర్భంలోని శిశువుకు అంగవైకల్యం ఉందని వైద్యులు గుర్తిస్తే గర్భస్రావం చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు నటరాజన్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ఉపకరణ నిర్ధారణ శిబిరాలను జిల్లాలో ఇప్పటి వరకు 4 చోట్ల నిర్వహించామని తెలిపారు. హియరింగ్ ఆడియాలజి, విజువలీ ఇంపైర్డ్, సెరిబ్రల్ పాల్సీ ఆర్థో మూడు విభాగాల్లోనూ పరీక్షలు నిర్వహించారు. ఉపకరణాలు అవసరమైన వారికి మూడు నెలల తర్వాత పంపిణీ చేస్తామని చెప్పారు. శిబిరానికి వాల్మీకిపురం, కలకడ, కెవి పల్లి, కలికిరి, పీలేరు మండలాల నుండి తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఫిజియో థెరపిస్టులు డాక్టర్ ఎం. సుజాత, డాక్టర్ కుసుమకుమారి, ఇఎన్‌టి వైద్యులు శ్రీదివ్య, ఆడియాలజిస్ట్ ఆర్.త్రిలోక్య, భవిత పాఠశాల ఉపాధ్యాయులు జి.సుబ్రమణ్యం, ధరణీజ, లక్ష్మీ, నేతాజీ, ధనలక్ష్మి, ఉమాపతి రెడ్డి, ప్రసాద్, సిఆర్‌పి మురళీధర్ రాజు పాల్గొన్నారు.

గ్రామ కంఠం సర్వేను వేగవంతం చేయండి

ప్రజాశక్తి - రాయచోటి

గ్రామకంఠం సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లతో జగనన్న పల్లె వెలుగు, జగనన్న స్వచ్ఛ సంకల్పం, వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు , భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం భూముల సర్వే, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష పిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దాలని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం పక్కగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠంకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలీడేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి పెట్టి కూలీల సంఖ్యను మరింత పెంచి లక్ష్యాన్ని వందశాతం సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలలో వేగం పెంచి గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం రీ సర్వేను పక్కాగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. అత్యంత ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వం నిర్మిస్తున్న శాశ్వత భవన నిర్మాణాలలో స్టేజీల వారీగా ప్రతివారం తప్పనిసరిగా ప్రగతి ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఎడి జయరాజ్, పంచాయతీ రాజ్ ఎస్ఇ సురేష్ కుమార్, డిపిఒ ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళిక

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాల అభివృద్ధి కోసం పంచాయతీ సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో హైదర్ వల్లి అన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో గురువారం సర్పంచులకు ఎంపీటీసీలకు ఆయా శాఖలకు సంబంధించిన అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రణాళికలు ఈనెల 31 లోపల సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా గ్రామాల పరిధిలో ఉన్న అవసరాలను గుర్తించి సర్పంచులు ఎంపీటీసీల ఆధ్వర్యంలో నివేదికలో సిద్ధం చేయాలని అన్నారు. వ్యవసాయ రంగానికి ఉపాధి కూలీలకు పనులు కల్పించి మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మాసన వెంకటరమణ మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు అధికారులు ఎపిఎం రెడ్డమ్మ. ఎపిఒ సురేంద్రనాథ్ రెడ్డి. కార్యదర్శులు, విఆర్‌ఒలు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ హైదర్‌వల్లి

ఇస్రో పరిశోధనల గురించి వివరిస్తున్న ప్రొఫెసర్ జి.విశ్వనాథన్

దేశాభివృద్ధే లక్ష్యంగా ఇస్రో ప్రయోగాలు

ప్రజాశక్తి-కురబలకోట

దేశాభివృద్ధే లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఇస్రో రూపొందుతోందని ప్రొఫెసర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. గురువారం ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల నందు స్పేస్ రాడార్ టెక్నాలజీస్ అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన వర్క్‌షాప్ నిర్వహించినారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జి. విశ్వనాథన్ మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ అంతరిక్ష పరిశోధనల కోసం కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన సంస్థ అన్నారు. బెంగు ళూరు కేంద్రంగా ఏర్పాటైన ఇస్రోకు దేశంలోని వివిధ ప్రదేశాల్లో పరిశోధన, అభివృద్ధి సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. రాడార్ అనేది రేడియో తరంగాలను ఉపయోగించి ఒక స్థలం నుండి వస్తువుల దూరం, కోణం, రేడియల్ వేగం తెలుసుకునే పద్ధతి అని వివరించారు. రాడార్ టెక్నాలజీ చాలా వాటిలో ఉపయోగపడుతుందని, వీటిలో అధునాతన టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామనాథన్, చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ ఈశ్వర్, కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చౌరెడ్డి మృతికి సంతాపం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పిటిఎం మండలం అంకిరెడ్డిపల్లి టిడిపి గ్రామకమిటీ అధ్యక్షులు వి.రమేష్‌రెడ్డి తండ్రి చౌరెడ్డి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చౌరెడ్డి కుమారుడు రమేష్ రెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. చౌరెడ్డి మృతి బాధాకరమని వారి కుటుంబానికి అన్నివిధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్టా చంద్రమోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగిరెడ్డి, రామచంద్ర, వెంకటప్ప, చంద్రారెడ్డి, పోతుపేట సర్పంచ్ చిన్నపరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.

బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ తహశీల్దార్

ప్రజాశక్తి -నందలూరు

ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్ డిప్యూటీ తహశీల్దార్‌గా గుడిపాటి రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పెనగలూరులో ఎఆర్‌ఐగా పని చేస్తూ పదోన్నతిపై నందలూరుకు బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మండలంలో భూములపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా వాటిని స్వీకరించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని అన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

దత్తాత్రేయ స్వామి జయంతి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని షిరిడి సాయి ఆలయంలో గురువారం స్వామి దత్తాత్రేయ జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు స్కంద మూర్తి శర్మ దత్తాత్రేయ స్వామిని విశేషంగా ఆలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దత్త శ్లోకాలు పఠించి దత్త దర్శనం, షిరిడి సాయిబాబా చరిత్ర, దత్త చరిత్ర పారాయణం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

ప్రజాశక్తి- నందలూరు

ప్రతిరోజు ధ్యానం చేయడం ద్వారా ప్రశాంతత లభిస్తుందని ఎంపిడిఒ సౌభాగ్యమ్మ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ గురించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు .ఇందులో మొదటి బ్యాచ్ పొత్తపి, టంగుటూరు, మదనమోహనపురం రెండవ బ్యాచ్ ఆడపూరు, నూకినేని పల్లి, టి. వి పురం గ్రామ పంచాయతీలకు చెందిన అధికారులు, పంచా యతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కడప రామచంద్ర మిషన్ కు చెందిన మాధవీ లత, పావనీ ధ్యానం తరగతులు తీసుకోగా జిల్లా నందు శిక్షణ పొందిన పొత్తపికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ సి.హరికృష్ణ, మండల టైపిస్ట్ అర్జున్ కుమార్ మండల అభివృద్ధి అధికారి సమక్షంలో తరగతులు నిర్వహించారు.

అభాగ్యులకు ఆర్థిక సాయం

బి.కొత్తకోట : వైసిపి జిల్లాఉపా ధ్యక్షులు, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్ అహ్మద్ జన్మ దినం సందర్భంగా గురు వారం పలు సేవా కార్యక్ర మా లు నిర్వహించారు. అనారో గ్యంతో బాధపడు తున్న కోటవీధికి చెందిన భవ్యకు రూ.20 వేలు, నందిశెట్టి వీధికిచెందిన కలీమున్ కు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. భవిత పాఠశాలలో దివ్యాంగులతో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. నగరపంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి భోజనవసతికి కల్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామచంద్ర యాదవ్, వైస్ ఎంపిపి ఖాదర్‌వలి, ఎంపిటిసిలు రామసుబ్బారెడ్డి, యల్లప్ప, నాగార్జునరెడ్డి, బూర్లపల్లె, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, సర్పంచులు రఘునాథరెడ్డి, అమరనాథ్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, భీమగాని ప్రభాకర్ రెడ్డి, సిఆర్.చిన్ని కృష్ణ, జాఫర్ బాషా, రామంజులు, బొమ్మసాని రాజా, జి.వి.రామకృష్ణలు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

క్రైం కార్నర్

పోలీసుల అదుపులో నాటుసారా నిందితులు

ఇద్దరు నాటు సారా నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

నాటు సారా సరఫరా చేసిన ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గత నెల 23వ తేదీన మండలంలోని బాలయ్యా గారి పల్లి పంచాయతీ ఎర్రయ్యగారి ఎస్‌టి కాలనీకి చెందిన మూడే నీలావతి, మూడే సోనియాలు కలిసి 20 లీటర్లు నాటుసార తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశామని తెలిపారు. వీరికి నాటు సారాను సరఫరా చేసిన నాయని వారి పల్లెకు చెందిన పేయల జనార్ధన, పేయల వెంకటరమణలను గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పూల చాదర్‌ను సమర్పిస్తున్న కలెక్టర్, డిప్యూటీ సిఎం, కమలాపురం ఎంఎల్ఎ

ఆశావాహుల్లో ఉత్కంఠ!

- పొలిటికల్ సర్వేలతో తెలుగు తమ్ముళ్లలో గుబులు
- గడప గడపకూ ప్రభుత్వ సమీక్షలతో వైసిపి నేతలు ఉక్కిరిబిక్కిరి
- మైదుకూరు, రాజంపేట, రైల్వేకోడూరులపై టిడిపి కన్ను

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలవడం ఆషామాషీ వ్యవహారం కానేకాదు. 2024 సార్వత్రిక ఎన్నికలకు అసెంబ్లీ టికెట్ లభించడం అనేక వడపోతల అనంతరం పర్యవసానంగా మారడం ఆశావహులకు సవాల్ విసురుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల్లోని సిట్టింగ్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలుగా వ్యవహరిస్తున్న వారికీ సవాల్‌గా మారింది. వైసిపి ఏడాదిగా గడప గడపకూ ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను తెలుసుకుని వ్యతిరేకతను తగ్గించుకున్న నేతలకు మళ్లీ టికెట్లను కేటాయించనున్నట్లు ప్రకటించడం తెలిసిందే. ప్రతిపక్ష టిడిపి సైతం పొలిటికల్ ప్రొఫెనలిస్టు రాబిన్‌సింగ్ బృందానికి టికెట్లపై సర్వేలు నిర్వహించడం తమ్ముళ్లలో గుబులు రేపుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రతిపక్ష టిడిపి తరుపున రాబిన్‌సింగ్ బృందం సర్వేలు, సమీక్షలు నిర్వహిస్తుండడం పొలిటికల్ హీట్‌ను పెంచింది. ఇటీవల రాజంపేట అసెంబ్లీ పరిధిలో వరుస సమావేశాలు, సమీక్షలు చేసిన సంగతి తెలిసిందే. గత ఎన్నికల ముంగిట టిడిపి అధ్యక్షులు ప్రొఫెలిస్టుల సర్వేల పట్ల అధికార వైసిపిని హేళన చేసిన ఫలితమే దారుణ పరాజయానికి దారితీసిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష టిడిపి సైతం టికెట్ల ఎంపికలో పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల వైపు మొగ్గుచూపింది. రాబిన్‌సింగ్ బృందం ఉమ్మడి జిల్లాలోని ఆయా అసెంబ్లీ, పార్ల మెంటరీ ప్రాంతాల్లోని ప్రధాన సమస్యలు, ఆశావహులకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ ప్రాతిపదికగా సర్వేలు చేసి ఇచ్చిన నివేదిక ఆధారంగా టికెట్లు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వరుస పర్యటనలు షురూ

టిడిపి అధ్యక్షులు చంద్రబాబు జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు ప్రాంతాల్లో నిర్వహించిన బాదుడేబాదుడు కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించిన సంగతి తెలిసిందే. ఇటీవల పొద్దుటూరు టిడిపి నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అరెస్టు వ్యవహారం సందర్భంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటన పొద్దుటూరు అభ్యర్థిగా ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాలకు రెండు, మూడు పర్యాయాలు పర్యటించాలని నిర్ణయించారు. జిల్లాలో పలు దఫాలుగా పర్యటిస్తున్నారు. గత ఆగస్టులో నియోజకవర్గాల వారీ సమీక్షలో రాజంపేట, మదనపల్లి అసెంబ్లీ పరిధిలో గట్టి సవాల్ ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయనే విషయాన్ని గుర్తించి, సత్వరమే దిద్దుబాటు చేసుకోవాలని హెచ్చరించడం గమనార్హం. టిడిపి వైసిపికి ధీటుగా ప్రాంతాల వారీగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నతీరు రాజకీయంగా చర్చ నీయాంశంగా మారింది. సార్వత్రిక ఎన్నికలకు ఏడా దిన్నర సమయం ఉండగానే జిల్లాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది.

కొన్నిచోట్ల పోటాపోటీ వాతావరణం

జిల్లాలో ప్రధానంగా కడప, రాజంపేట, మైదుకూరు, రైల్వేకోడూరు, మదనపల్లి అసెంబ్లీల పరిధిలో పోటాపోటీ వాతావరణం నెలకొనే అవకాశం ఉందని పరిశీలకుల అంచనాలు ఉన్నాయి. రాజంపేటలో టిడిపి ఇన్‌ఛార్జిగా బత్యాల చెంగల్రాయులు ఉన్నారు. ఈయన వైసిపి అభ్యర్థి నాయకత్వానికి ధీటైన వ్యక్తిగా నిలిచారు. సామాజిక, ఆర్థిక బలాబలాలే గెలుపునకు దోహదం చేసే అవకాశాలు ఉన్నాయి. మైదుకూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా సుధాకర్‌యాదవ్ సమర్థ నాయకత్వం ఉంది. ఈయనకు టికెట్ కేటాయించి ప్రణాళికాబద్ధంగా సహాయ సహకారాలు అందిస్తే గెలిచే అవకాశాలను కొట్టిపారేయలేని పరిస్థితి. రైల్వేకోడూరుకు టిడిపి సరైన అభ్యర్థిని రంగంలోకి దించితే పొత్తు అవకాశాల నేపథ్యంలో ఆశించిన ఫలితాలు రావొచ్చనే వాదన వినిపిస్తోంది. మదనపల్లిని జిల్లా కేంద్రంగా ప్రకటించని నేపథ్యం అధికార పార్టీకి ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. ఇటువంటి అవకాశాన్ని సరైన అభ్యర్థి ఎంపిక, వ్యూహాత్మక ప్రచారం ద్వారా సాధించుకునే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కడప జిల్లాలోని 10 అసెంబ్లీలను వైసిపి క్లీన్ స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపక్ష టిడిపి, జనసేన, బిజెపి పొత్తు కుదిరితే ఉమ్మడి జిల్లాలోని ఐదు అసెంబ్లీల పరిధిలో అధికార పార్టీకి పోటీనిచ్చే అవకాశాలు ఉంటాయనే అంచనాలు ఉన్నాయి. ఏదేమైనా పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల నివేదిక ఆధారంగా టికెట్లు కేటాయించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఆశావహుల్లో ఎవరికి టికెట్ లభించనుందోననే ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది.

రూ.27 కోట్ల బ్యాంకు ఖాతాలు జప్తు

రాష్ట్రంలో తొలిసారిగా సైబర్ నేరగాళ్లపై ఈడి చర్యలు
దర్యాప్తు అధికారులను అభినందించిన ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

సైబర్ నేరాల ద్వారా ఆర్జించిన అక్రమ సొమ్మును విదేశాల్లో క్రిప్టో కరెన్సీ రూపంలో మళ్ళించి పెట్టుబడులు పెట్టిన నేరగాళ్ల ఖాతాల్లోని రూ.27 కోట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ) జప్తు చేసినట్లు ఎస్‌పి అన్బురాజన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించార. రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక సైబర్ నేరానికి సంబంధించి బ్యాంకు ఖాతాలను జప్తు చేయడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఇంట్లోనే ఉంటూ సులువుగా డబ్బులు సంపాదించండి అంటూ ఆర్‌సిసి, మేకింగ్ మనీ పేరిట సెల్‌ఫోన్లలో బల్క్ ఎస్ఎంఎస్ ద్వారా లింకులు ఎరగా చూపుతున్నారని తెలిపారు. కమీషన్ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని ఊరించి ప్రజలను ఊబిలోకి దింపుతారని చెప్పారు. ముందుగా చిన్నమొత్తాల్లో రూపంలో కమీషన్ పొందిన ప్రజలు నమ్మి అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టి మోసపోతున్నారని తెలిపారు. ఇదంతా వాట్సప్ ద్వారా చాట్ చేస్తూ మోసాన్ని కొనసాగిస్తారని వివరించారు. టాస్క్ కూడా అతి సులువుగా ఉండటంతో మరింత మంది తమ సన్నిహితులకు, తెలిసిన వారికి చెప్పి ఇందులో చేర్పించి వారితో కూడా పెట్టుబడిగా సొమ్మును పెట్టడంతో వారు కూడా మోసానికి గురయ్యారని తెలిపారు. వర్చ్యువల్ పేమెంట్ అడ్రస్ ద్వారా డబ్బును సైబర్ నేరగాళ్ల ఖాతాలకు డిపాజిట్ చేయించుకుంటారని పేర్కొన్నారు. బాధితుల ఖాతాలో పెద్ద మొత్తంలో డబ్బులు ఉన్నట్లుగా యాప్‌లో కనిపిస్తుంటుందని తెలిపారు. కానీ అదంతా ఫేక్ డిస్‌ప్లే చూపించి నమ్మిస్తారని పేర్కొన్నారు. అప్పటికే బాధితుల మొత్తాన్ని ఇతర ఖాతాలకు తరలించి సైబర్ నేరగాళ్లు దానిని క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చుకుంటారని తెలిపారు. సైబర్ నేరగాళ్ళ పై జిల్లాలోని కడప వన్ టౌన్, మైదుకూరు, దువ్వూరు, చాపాడు లలో బాధితుల ఫిర్యాదు మేరకు 4 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. పోలీసుల విచారణలో జిల్లా వ్యాప్తంగా రూ.11 కోట్లకు పైగా నగదు కొల్లగొట్టినట్లు విచారణలో తేలిందని తెలిపారు. దర్యాప్తులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానంతో తమిళనాడుకు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్ల ను అరెస్టు చేసి వారి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి ఎన్‌ఫోర్సుమెంట్‌కు తదుపరి చర్యలకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులకు సంబంధించి ఫ్రీజ్ చేసిన బ్యాంకు ఖాతాలలోని రూ.27 కోట్లను జప్తు చేసినట్లు తెలిపారు. కేసులో కీలక పాత్ర పోషించిన అప్పటి కడప వన్ టౌన్ సి.ఐ టి.వి సత్యనారాయణ, సైబర్ క్రైమ్ అండ్ ఫైనాన్సియల్ ఫ్రాడ్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన రైతు కాతా. రామిరెడ్డి(65) అప్పుల బాధలు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు కున్నాడు. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. రైతుకు నాలుగు ఎకరాల భూమి ఉంది. పంటలు సాగు చేసినప్పటికీ దిగుబడి రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. తనకు ఉన్న భూమిని అమ్మి కొంత వరకు అప్పులు తీర్చాడు. ప్రస్తుతం ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వంకాయ, మిరప, చిక్కుడు పంటలు వేశాడు. పంటల సాగు కోసం సుమారు రూ. 15 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట దిగుబడి సరిగ్గా రాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. పంటలు అధికం కావడంతో ఎలా తీర్చాలని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బాధపడేవాడు. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. రామిరెడ్డి ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసే సరికి అతను కన్పించకపోవడంతో చుట్టూ పక్కల వెతికారు. ఆదేరోజు రాత్రి గ్రామ సమీపంలో ఉన్న కంకర మిషన్ వద్ద పొలాలకు వాడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య లక్ష్మి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

రైతు మహాసభకు ప్రతినిధిగా దస్తగిరిరెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

కేరళ రాష్ట్రంలో ఈనెల 13 నుంచి 16 వరకు నిర్వహించబోయే అఖిల భారత రైతు మహాసభకు కడప జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డిని ఎంపిక చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అఖిల భారత రైతు మహాసభలలో రైతాంగ ఉద్యమాలు పోరాటాలను సమీక్షించి భవిష్యత్ పోరాటాలకు దిక్సూచి సూచిస్తారని తెలిపారు. మహాసభలలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన నూతన రైతు వ్యతిరేక సాగు చట్టాలు, గిట్టుబాటు మద్దతు ధరల చట్టం, రైతాంగ ఆత్మహత్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. మహాసభలలో కడప జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పై అఖిల భారత రైతు మహాసభ దృష్టికి తీసుకొని పోతామని చెప్పారు. అనంతరం మహాసభలో భవిష్యత్తు ఆందోళన పోరాటాలకు రూపకల్పన చేస్తామని పేర్కొన్నారు. కడప జిల్లా కార్యదర్శి ని ఎంపిక చేయడంపై రాష్ట్ర కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మహాసభల సందర్భంగా 10, 11 తేదీలలో జిల్లాలో, గ్రామాలలో రైతు సంఘం జెండా లను ఆవిష్కరిస్తామని చెప్పారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప

విజేతలతో ఎస్ఎస్ఎ పిఒ, స్టెప్ సిఇఒ

వైఎస్ఆర్ జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు-2022 పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి గురువారం సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి, కెఎస్ఆర్ఎమ్ కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ బహుమతులు ప్రదానం చేశారు. రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీలలో ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచిన వారి పేర్లను స్టెప్ సిఇఒ ప్రకటించి వారికి బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మంచి కలలు ప్రదర్శించి ఉన్నతస్థాయి పోటీలలో కూడా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

భారీ స్కోరు సాధించిన నార్త్ జోన్ జట్టు

కడప : ఎసిఎ అండర్ 25 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం స్థానిక కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నార్త్ జోన్- సెంట్రల్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన సెంట్రల్ గవర్నమెంట్ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన నార్త్ జోన్ జట్టు 62.5 ఓవర్లలో 296 పరుగుల భారీ స్కోరు చేసి ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని రవి కిరణ్ 64, అవినాష్ 50 పరుగులు చేశారు. సెంట్రల్ జోన్ జట్టులోని బ్రహ్మ తేజ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి నాలుగు వికెట్లు తీసకున్నాడు. అనంతరం బ్యాటింగ్కు దిగిన సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసిన సమయానికి 11 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 35 పరుగులు చేసింది.

వ్యాపారులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - కడప అర్బన్

కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి వ్యాపారులకు అండగా ఉంటుందని కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అమీర్‌బాబు, నగర అధ్యక్షులు శివకొండారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని 25వ డివిజన్‌లో టిడిపి వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిసిలపట్ల వైసిపికి చిత్తశుద్ధి లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించలేదని విమర్శించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జయకుమార్, ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, డివిజన్ ఇన్‌ఛార్జీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సుబ్బరాయుడు, వరప్రసాద్, మురికినాటి రామాంజనే యులు, క్రిష్టియన్ సెల్ అధ్యక్షులు పేనుబాల ప్రేమ్‌కుమార్, కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఖాసీం పాల్గొన్నారు.

12న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు రాక

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో నిర్వహిస్తున్న పాదయాత్రలో పాల్గొనేందుకు ఈనెల 12న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కడపకు వస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి ఎ. రామమోహన్, కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, కమిటీ సభ్యులు ఓబులేసు పేర్కొన్నారు. గురువారం నగరంలోని పాత బస్టాండ్‌లోని సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నేటికీ అమలు చేసుకోవడం వల్ల జిల్లా ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. జిల్లాలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం పెద్దగా పురోగతి సాధించలేకపోవడం వల్ల ప్రజానీకానికి ఉపాధి లేకుండా పోతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని శిలాఫలకాలు ఏర్పాటు చేసినా ఆచరణలో అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. జిల్లాలో రోజురోజుకూ వ్యవసాయం బాగా దెబ్బతింటోందని, ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కోసం పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లాలో కొత్త పరిశ్రమలు రాకపోగా ఉన్నవి మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్నత చదువులు చదివిన యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు,దేశాలు వెళ్లాల్సిన పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం అవసరమైన మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం వల్ల నేటికీ పరిశ్రమ ఏర్పాటు కావడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో ఉన్న ముడి సరుకును ఉపయోగించుకుని ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగయ్యే అవకాశం ఉందన్నారు. పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వసతి గృహంలో ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని ఎస్‌సి బాలుర వసతి గృహంలో ఇన్‌ఛార్జి వార్డెన్ హరికృష్ణ ఆధ్వ ర్యంలో డాక్టర్ వెంకట సందీప్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం 116 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. మీకు ఏమైనా అనారోగ్యంగా ఉన్న ట్లయితే మీ దగ్గరలోనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చూపించుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రామచంద్రుడు, సర్పంచి ఖాజావలి, హెల్త్ ఆఫీసర్ నిర్మల, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, శారద, ఆరోగ్య పరిరక్షకురాలు నాగమణి ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

విభిన్న ప్రతిభావంతులకు అన్నదానం

ప్రజాశక్తి - వల్లూరు

కడప నగరంలోని ఓల్డ్ రిమ్స్‌లో ఉన్నటువంటి విభిన్న ప్రతిభావంతుల ఆశ్రమంలో మండలంలోని తప్పెట్ల గ్రామానికి చెందిన కీర్తిశేషులు సాతాని శ్రీనివాసులురెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత బస్టాండ్, సెవెన్ రోడ్స్, ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఉన్నటువంటి యాచకులకు ,అనాథలకు భోజనాలు ప్యాకింగ్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాతాని ఆంజనేయులురెడ్డి, సాతాని, వెంకటరమణారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశ్రమ అభాగ్యులకు....

పోరుమామిళ్ల టౌన్: డాక్టర్ ఎస్‌వివి ప్రసాద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రసాద్ 15వ వర్ధంతి సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ చక్రవర్తి గురువారం ఓబులాపురం సమీపంలోని వివేకానంద సేవాశ్రమంలోని అభ్యాగులకు అన్నదానం నిర్వహించారు. వారికి వైద్య సలహాలు ఇచ్చారు. పోరుమామిళ్ల పట్టణంలోని వేణుగోపాల స్వామి గుడి ప్రాంగణంలోనూ అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ట్రస్టును ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు బండి వెంకట్, శెట్టెం ప్రతాప్, వసంత, శ్రీధర్, ప్రసాద్, మధు, నాగేంద్ర, మద్దిలేటి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి

చెన్నూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, సమన్వయంగా గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపిడిఒ జాన్‌వెస్లీ, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ సమావేశంలో వారు మాట్లాడుతూ మండల అధికారులందరూ గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్ అమలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సర్పంచ్లు, ఎంపిటిసిలు, ఎఎన్ఎంలు, గ్రామ సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్రాన్ని సందర్శించిన శ్వేతారెడ్డి

నాయకులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కాశినాయన : జ్యోతి క్షేత్రం 27వ ఆరాధన సందర్భంగా తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటు మహిళా అధ్య క్షురాలు కర్నాటి శ్వేతా రెడ్డి, టిడిపి కర్నాటి వెంకటరెడ్డి సుబ్బారెడ్డి గురువారం జ్యోతి క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘ క్షేత్రంలో జ్యోతి క్షేత్ర ఆర్యవైశ్య సంఘ ప్రెసిడెంట్ చిన్న పీరయ్య, నరసాపురం ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిచ్చయ్య పాల్గొన్నారు.

ఎపిపిఎస్‌సి పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

కడప : ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ **(ఎపిపిఎస్‌సి)** ఆధ్వర్యంలో ఈ నెల ఈనెల 9 నుంచి 12 వరకు పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులు, ఆయా సెంటర్ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు, ఉంటాయన్నారు. ఆఫ్‌లైన్ పరీక్షలు డిస్క్రిప్టివ్ విధానంలో ఉదయం 9 గంటలనుంచి 12 వరకు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరు కోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యక లాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కడపనగరంలో కెఒఆర్ఎం, అన్నమాచార్య, ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ, ప్రొద్దుటూరులోని సాయి రాజేశ్వరి, చైతన్యభారతి, వాగ్దేవి ఇన్‌స్టిట్యూట్‌లలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

అక్రమ రవాణా చట్టరీత్యా నేరం

కడప : మాదకద్రవ్యాల అక్రమ రవాణా చట్టరీత్య నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత అన్నారు. గురువారం జడ్జి లీగల్ లిటరసీ క్లబ్ ను సందర్శించారు. కడప నగరం, ఏడు రోడ్ల కూడలిలో ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ పదార్థాల, చట్టం, 1985 అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకో ట్రాఫిక్ పదార్థాల, చట్టం, 1985 గురించి వివరించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా చట్టరీత్యా నేరం అన్నారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. గృహహింస చట్టం, ఫోక్సో చట్టం, గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూర్యారావు, డాక్టర్ నీలవేణి, హేమలత, ప్యానల్ న్యాయవాది చంద్రకాంతమ్మ, లెక్చరర్స్ విద్యార్థినిలు పాల్గొన్నారు.

విజయ పరంపర కొనసాగిస్తాం

కడప : హిమాచల్ ప్రదేశ్ శాసనసభకు జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలతో విజయం సాధించిందని, ఈ విజయ పరంపరను కాంగ్రెస్ భవిష్యత్తులోను కొనసాగిస్తుందని, కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్ర మోడీ పాలనతో ప్రజలు విసుగెత్తి ఉన్నారని, రాబోయే ఎన్నికలలో కచ్చితంగా ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడతారన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ , జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి సాదికలి , ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు,పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చాలి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క రైతూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులకు అందే విధంగా చూడాలన్నారు. పిఎం కిసాన్, రైతు భరోసా, ఈక్రాప్ బుకింగ్, ఆర్‌బికెల ద్వారా ఎరువులను అందించడం, పొలంబడి వంటి అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వరహరి కుమార్, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు

నేడు కొక్కరాయపల్లికి ఎమ్మెల్యే రాక

చెన్నూరు : మండలంలోని కొక్కరాయపల్లిలో నిర్వహించబోయే జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకంలో భాగంగా రైతులకు భూ హక్కు పత్రాలు అందించడానికి శుక్రవారం ఎంఎల్ఎ రవీంద్రనాథరెడ్డి రానున్నారని వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. భూహద్దులకు సంబంధించి పక్కాగా సర్వే చేయించి వారికి భూ హక్కు పత్రాలను అందజేస్తారన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కడప : ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష తన కార్యాలయంలో గురువారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 22 లక్షల, 13 వేలను అందజేశారు. కార్యక్రమంలో అహమ్మద్ బాషా, ఉమేర్, జహీర్, తోట కృష్ణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా డ్రగ్స్ అక్రమ రవాణా

ప్రజాశక్తి - కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న జియావుద్దీన్, శివ

రాష్ట్రంలో విచ్చల విడిగా డ్రగ్స్, గంజాయి ఆక్రమరవాణా సాగుతుందని, సిఎం జగన్ మోహన్‌రెడ్డి బాధ్యత వహించి సమాధానం చెప్పాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాఉద్దీన్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ డిమాండ్ చేశారు. గురువారం గాయత్రి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం మాని డ్రగ్స్‌కు బానిసలుగా చేస్తున్న వైసిపికి పరిపాలించే హక్కు లేదని చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే మన రాష్ట్రంలో ఎక్కువ డ్రగ్స్ లభిస్తుండటం ప్రమాదకరమైన సంకేతమని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని త్వరలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షులు అనిల్, 44వ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఖాజాపీర్, తెలుగు యువత నాయకులు ఉదయ్, అర్జున్, ప్రవీణ్, నితిన్ పాల్గొన్నారు.

పీఠాధిపతి ఆశీస్సులు పొందిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మలాంజి స్వామి ఆశీస్సులు పొందుతున్న బాలదాసు

నగరంలోని పెద్దదర్గాలో పీఠాధిపతి సయ్యద్ మహమ్మద్ ఆరీఫుల్లా హుస్సేని, దర్గాలో ఉపవాస దీక్షలో ఉన్న మలాంజి స్వామి ఆశీ ఃస్సులను టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, నగర మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్.ఇమ్రాన్, కొండా సుబ్బయ్య, నాదెండ్ల దస్తగిరి, దూదేకుల అజ్మతుల్లా పొందారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల పవిత్రతకు, విశ్వాసాలకు ఆదర్శం పెద్ద దర్గా అన్నారు.

నగర మహాసభలు జయప్రదం చేయాలి : సిఐటియు

కడప అర్బన్ : నగరంలో ఈ నెల 10న నిర్వహించే సిఐటియు నగర 5వ మహాసభను జయప్రదం చేయాలని నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పిలుపు గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు పోరాటాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నగరంలోని అన్ని రంగాల కార్మికుల సమస్యలపై సిఐటియు నాయకత్వం పోరాటం నిర్వహిస్తుందని చెప్పారు. మహాసభలో కార్మిక, ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చంద్రారెడ్డి, మున్సిపల్ పెడరేషన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర రవి, వై.ఎం.కేశవ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఉరుసు

కడప అర్బన్ : మత సామరస్యానికి ప్రతీక పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలని జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాదర్‌బాష అన్నారు. గురువారం జెకె యూత్ ఆధ్వర్యంలో పెద్ద దర్గా పీఠాధిపతి హజ్రత్ ఖాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా హుస్సే ని ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయ ప్రదం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మౌలానాజాద్ ఉర్దూ యూనివర్శిటీ ప్రొఫెసర్ సికిందర్ హుస్సేన్ పాల్గొన్నారు.

కెఎల్ఎం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లా స్థాయి యువజనోత్సవంలో కెఎల్ఎం విద్యార్థినికి ద్వితీయ బహుమతి సాధించారు. సిఎస్ఇ మొదటి సంవత్సరం చదువుతున్న బి.హేమాక్షి వయోలిన్ వాయిద్యంలో ద్వితీయ స్థానం లభించింది. మెమోంటో, ప్రశంసాపత్రాన్ని అందించారు. బహుమతి సాధించిన విద్యార్థినిని కళాశాల ఎం.డి.డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, కరస్పాండెంట్ కె.రాజేశ్వరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కల్వర్టు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని జడ్‌పి మార్కెట్ హైస్కూల్‌కు విద్యార్థులు వెళ్లేందుకు అధికారులు కల్వర్టు నిర్మించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ కోరారు. స్థానిక జడ్‌పి హైస్కూల్ వద్ద కూలిపోయిన కాలువ రోడ్డును గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జడ్‌పి మార్కెట్ హైస్కూల్ విద్యార్థులు బడికి వెళ్లాలంటే నిత్యం ఇబ్బందులు తప్పడంలేదన్నారు. స్కూల్‌కు వెళ్ళే దారిలో కాలువ ఉందని, పైన తాత్కాలిక మట్టి రోడ్డు వేశారన్నారు. స్కూల్లో నాడు-నేడు కింద పాఠశాల పనులు జరుగుతున్నాయని ట్రాక్టర్లు, టిప్పర్లు వాహనాలు నిత్యం వెళ్లే క్రమంలో కాలువ పైన వేసిన తాత్కాలిక మట్టి రోడ్డు కుంగిపోయిందన్నారు. విద్యార్థులు వెళ్లే సందర్భంలో రాళ్లు పడే ప్రమాదం ఉందన్నారు. అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. కల్వర్టు నిర్మించడంలో నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. వీటి కోసం ఉపాధ్యాయులు పిల్లల చేత మట్టి మోయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు స్పందించి కాలువ పైన కల్వర్టును నిర్మించాలని వారు కోరారు.

కల్వర్టును పరిశీలిస్తున్న నాయకులు

15న ఐటిఐలో భారీ జాబ్‌మేళా

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీ కందుల ఓబుల్ రెడ్డి చారిటీస్ ఐటిఐలో ఈనెల 15న ఉదయం 9గంటలకు భారీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటిఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని ఇనోదయ ప్రెసిపేరెట్ ప్రయివేటు లిమిటెడ్ ఏజెన్సీ వారు 20 ప్రముఖ కంపెనీలతో సమన్వయం చేసుకొని ఆయా కంపెనీల్లో వివిధ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు తమ సర్టిఫికెట్లుతో హాజరుకావచ్చన్నారు. అనుభవం, కంపెనీ ప్రాధాన్యతను బట్టి జీతభత్యాలు ఉంటాయన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లోని 600 మంది విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కడపకు చెందిన వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జయప్రకాష్, ఎఎస్‌డబ్ల్యుఒలు గణేష్‌బాబు, ప్రభాకర్ మనోహర్, లక్ష్మీ శైలజ, 23వ వార్డు కౌన్సిలర్ ఎ సుజాత పాల్గొన్నారు.

కరాటేలో శ్రీనివాస పాఠశాల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

కరాటే పోటీల్లో శ్రీనివాస పాఠశాల విద్యార్థి నవహరి రెండు మెడల్స్ సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ కేశవులు తెలిపారు. ఆ మేరకు గురువారం మెడల్స్ సాధించిన విద్యార్థికి పాఠశాల కరస్పాండెంట్ కేశవులు అభినందించారు. కర్నూలులో జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారన్నారు. 11ఏళ్ల విభాగంలో విద్యార్థి ప్రతిభ చూపడంతో మెడల్స్ సాధించినట్లు చెప్పారు. మంచి శిక్షణనిచ్చిన కరాటే మాస్టర్ విజయ్‌ను కూడా పాఠశాల యాజమాన్యం తరుపున అభినందించారు.

విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ కేశవులు

ఉక్కు పాదయాత్ర చేసి తీరుతాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తలపెట్టిన ఉక్కు పాదయాత్ర చేసి తీరుతామని సిపిఐ జమ్మలమడుగు కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి లోకేష్ తెలిపారు. ఆ మేరకు వారు గురువారం స్థానిక ఎన్‌జిఒ హోంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్లమెంటు సాక్షిగా చట్టమైన రాష్ట్ర పునర్విభజన చట్టంలోనూ పొందుపరిచిన ఉక్కు పరిశ్రమ నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలిపారు.

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం జరిగే బహిరంగ సభను నిరుద్యోగ యువత జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో కన్యతీర్థం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు జమ్మలమడుగు గాంధీ బొమ్మ వద్ద బహిరంగ సభ ఉంటుందని, పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత పాల్గొనాలని ఆయన కోరారు. అయిదు రోజుల పాదయాత్రకు సంపూర్ణ మద్దతు స్థానిక తెలుగుదేశం ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, కార్యకర్తలు తెలుపుతున్నారన్నారు.

ఎర్రగుంట్ల : విభజన చట్టంలో ఉన్న కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఈ నెల 9న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాదయాత్ర చేపట్టారని విద్యార్థులు, యువకులు, ప్రజలు పాల్గొనాలని ఎఐవైఎఫ్ నాయకులు శరత్‌కుమార్ కోరారు. స్థానిక జూనియర్, డిగ్రీ, ఐటిఐ కళాశాలో గురువారం కరపత్రాలు పంచి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, గణేష్, అనిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

శుక్ర, శని, ఆది మూడు రోజులు జిల్లాలో భారీ వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ గిరీషా పిఎస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళా ఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలో గంటకు 60 నుంచి 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఆవకాశం ఉందని, నదులు, వాగులు, వంకలు పరిసర ప్రాంతాలకు వెళ్ళద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉధృతంగా ప్రవహించే నదులు, వాగులు, వంకల్లోకి దాటేందుకు సాహసం చేయొద్దన్నారు. ఈసారి కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి, ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ శాఖ చెప్పడం జరిగిందన్నారు. మండూస్ తుఫాన్ ను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఎటువంటి ఇబ్బంది ఉన్న జిల్లా కమాండ్ కంట్రోల్ రూం 08561-293006 సమాచారం అందివ్వాలన్నారు. అన్నిచోట్ల కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వరద ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు మరమ్మతులు, సహాయక చర్యలు చేపట్టేందుకు అధికారులను సిద్ధం చేశాం అన్నారు. వరద ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డిఆర్ఒ సత్యనారాయణ, పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌జిఒ సహకార సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - రాయచోటి

ఎన్‌జిఒ తాలూకా సహకార సంఘం ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎన్నికల అధికారి కె.వి. వరప్రసాద్ గురువారం తెలిపారు. పట్టణంలోని పట్టణంలో ఎన్‌జిఒ కాలనీలో అధ్యక్షులుగా ఎం మధుసూదన్ రెడ్డి మాత్రమే దాఖలు వేసినట్లు తెలిపారు. ఉపాధ్యక్ష వెంకటేశ్వర రెడ్డి నామినేషన్ల వేశారున్నారు. పోలింగ్ అనంతరం జయచంద్ర గెలిపొందినట్ల పేర్కొన్నారు పాలక వర్గానికి 7 స్థానాలు అవసరం కాగా ఏడుగురు మాత్రమే నామినేషన్ ధాఖలు చేశారున్నారు. ఎవరు ఉపసంహరించనందున ఎన్నుకల అధికారి సంఘ పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెప్పారు. అధ్యక్షునిగా మధుసూధనరెడ్డి, ఉపాధ్యక్షులుగా జయచంద్ర , డైరెక్టరులుగా వెంకటేశ్వర, రాజా , దేవేంద్ర , సిద్దయ్య , ప్రసాద ఎన్నికయ్యారు అన్నారు. నూతనంగా ఎంపికైన వారిని జిల్లా అధ్యక్షులు ఎరపరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

'నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి'

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీలో చేపట్టే ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో గురువారం జగనన్న ఇంటి నిర్మాణాల పురోగతిపై ఎంపిపి లక్ష్మి గాయత్రి అధ్యక్షతన ఎంపిటిసిలు, సర్పంచులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలపై సచివాల సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి, ఆర్‌డిఒ మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణాల్లో అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు సచివాలయ సిబ్బంది పాటుపడాలన్నారు. వేగవంతంగా ఇంటి నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులపై ఒత్తిడి పెంచాలన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టే లబ్ధిదారులకు రుణాలు కూడా ఇప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు భాగస్వాములై జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టకపోతే మంజూరైన బిల్లులను వెనక్కి చెల్లించాల్సి ఉంటుందని లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది వివరించాలని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయా జగనన్న లే అవుట్లల్లో మౌలిక సదుపాయాలు విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలని ఎంపిటిసిలు అధికారులను కోరారు. నీరు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతోనే లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్ట లేక పోతున్నట్లు వారు అధికారుల దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఒఎస్‌డి మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కాలనీల్లో రోడ్డు పనులు చేపట్టేందుకు నిధులు కూడా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్, నీటి సౌకర్యాన్ని ఆయా లేఅవుట్లలో కల్పించేందుకు త్వరితగతిన పనులు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. పనుల్లో మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. విధుల్లో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా లబ్ధిదారులకు బిల్లులు కూడా వెంటనే మంజూరు చేయాలన్నారు. సిమెంటు, ఇసుక, కడ్డీలు కొరత లేకుండా సకాలంలో అందించాలన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు సచివాల సిబ్బంది పని చేయాలన్నారు. అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం మార్గం లబ్ధిదారులకు చూపాలన్నారు. ఇంటి నిర్మాణాల్లో పురోగతి సరిగా లేదని సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. మండలస్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తే పురోగతి అనేది ఉంటుందన్నారు. ఇంకా ప్రారంభంకాని ఇంటి నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. అనంతరం శాశ్వత భూ హక్కు పథకానికి చెందిన పత్రాలను రైతులకు ఒఎస్‌డి, ఆర్‌డిఒ అందజేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఎఇ సుకుమార్‌రెడ్డి, వెలుగు ఎపిఎం బాలస్వామి, ఎంపిటిసి, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలి : డిఇఒ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ దేవరాజు

ప్రజాశక్తి - చాపాడు

పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉన్న వంద రోజుల ప్రణాళికను ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి దేవరాజు ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. అనంతరం డిఇఒ విద్యార్థులతో కలిసి అక్కడే అన్నం తిన్నారు. పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని అవగాహన కల్పించారు. సబ్జెక్ట్ వారీగా 100 రోజుల ప్రణాళికను పాటించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే కెరీర్ గైడెన్స్ విద్యార్థులకు ఇవ్వాలన్నారు. అన్ని ఉన్నత పాఠశాలలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో స్టడీ హవర్స్, యాక్షన్ ప్లాన్ గురించి చర్చించి 100 శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని ఎంఇఒ రవిశంకర్‌కు సూచించారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రాన్ని సందర్శించారు. పాఠ్య పుస్తకాలు అన్ని పాఠశాలలకు సరఫరా చేసి వాటిని ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఉన్నత పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించాలని, అందుకు తగిన ప్రణాళిక వేసుకొని పర్యవేక్షణ జరపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌస్‌మొద్దీన్, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల్లో ట్రిపుల్‌ఐటి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా యువజన ఉత్సవాల్లో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు సత్తా చాటినట్లు డైరెక్టర్ సంధ్యారాణి తెలిపారు. గురువారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆమె అభినందించారు. యవజన ఉత్సవాల్లో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఆర్‌జెయుకెటి యూనివర్సిటీ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు చెప్పారు. కూచిపూడి, జానపద నృత్యం, చిత్ర లేఖనం, మిమిక్రీ, నాటకం, జానపద గీతాలాపనలో యశ్వత, లహరి, త్రివేణి, దేవి, రమ్యశ్రీ, నవ్యశ్రీ, పావని, భానుప్రియ, రోష్ని, పూజిత, మహబూబ్ బాషా, లోకేష్, గణేష్‌త పాటు పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ఆయా రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఆర్‌కెవ్యాలీ ఫైన్ ఆర్ట్స్ విభాగం అధ్యాపకులు జ్యోతిశ్వర్, రామకృష్ణ (గాత్ర సంగీత శిక్షకులు), మోహినుద్దీన్ ఖాన్ (కూచిపూడి నాట్యాచార్యుడు), సాయికృష్ణ (మదంగం), సాయిపావని (కూచిపూడి నాట్యాచార్యులు)లకు డైరెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్ సంధ్యారాణి

కాంగ్రెస్ పటిష్టతకు పంచముఖ వ్యూహం

ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కాంగ్రెస్‌పార్టీ పటిష్టతకు పంచముఖ వ్యూహం అవలంభించనున్నట్లు ఆ మీడిమా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి తెలిపారు. స్థానిక కళ్యాణమండపంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిజెపి చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను, రాష్ట్రవ్యాప్తంగా వైసిపి వైఫల్యాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియ జేస్తామన్నారు. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేస్తామన్నారు. 2024లో అధికారంలోకొస్తే ప్రజా రంజకమైన ఆరు అంశాలను తెలిపేలా వ్యూహం రూపకల్పన చేస్తామన్నారు. దీన్ని శుక్రవారం నుండి అమలు చేస్తామన్నారు. బిసిలకు తామేదో చేసేసినట్లు వైసిపి, టిడిపి చెప్పుకుంటున్నాయని తెలిపారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే బిసిల నిజమైన నేస్తమని ఆయన వివరించారు. సమావేశంలో ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జి నజీర్, సైమన్ పీరాన్, భాస్కర్, దావీదు, రామిరెడ్డి, ఉత్తన్న, సుబ్రహ్మణ్యం, అమీర్, నాగార్జున పాల్గొన్నారు.

హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం హర్షణీయం

వేంపల్లె : బిజెపి పాలిత రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి మెజార్టీతో అధికారంలోకి రావడం హర్షణీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్న 68 సీట్లుకుగాను కాంగ్రెస్ 40 సీట్లు సాధించిందన్నారు. బిజెపికి 25 సీట్లు, ఇండిపెండెంట్‌కు 3 సీట్లు వచ్చాయన్నారు. ఆప్ పార్టీకి ఒక సీటు కూడా రాలేదన్నారు. బిజెపి డబుల్ ఇంజన్ నినాదం ఏ మాత్రం పని చేయలేదని ఆయన తెలిపారు. గుజరాత్‌లో ఆప్, ఎంఐఎం పార్టీలు బిజెపి వ్యతిరేక ఓట్లును చీల్చి కాంగ్రెస్‌ను దెబ్బ తీసినట్లు చెప్పారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపిని కాంగ్రెస్ ఓడించడం అసాధ్యం కాదన్నారు.

గంజాయి, డ్రగ్స్‌కు నిలయంగా రాష్ట్రం : టిడిపి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్‌కు నిలయంగా మార్చిందని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలకరులతో మాట్లాడుతూ గతేడాదిలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో డ్రగ్స్ పట్టుబడిన రాష్ట్రంగా అత్యధికంగా ఉందన్నారు. ఎపిలో 18,267 కిలోల డగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సిఆర్‌పిఎఫ్ వెల్లడించిందన్నారు. 1,057 కిలోల గంజాయి రూ.97 కోట్ల విలువైన 165 టన్నుల ఎర్రచందనం స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి యమ్మనూరు ఆంజనేయులు, పట్టన తెలుగు యువత కార్యదర్శి పల్ల సాయిరాం పాల్గొన్నారు.

మైదుకూరు : రాష్ట్రంలో గంజాయి మాఫియా కొనసాగుతోందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల అభివృద్ధి, సంక్షేమం రంగంలో పోటీ పడుతుంటే మన రాష్ట్రం ఇందుకు భిన్నంగా ఉందన్నారు. గడచిన మూడున్నర ఏళ్లలో వైసిపి నాయకులు రాష్ట్రంలో యువత భవిషత్ నాశనం చేసే గంజాయి, మద్యం, హెరయిన్, గుట్కా, మాఫియా నడిపిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురప్ప, జిల్లా కార్యదర్శి సిద్దయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో మాట్లాడుతూన్న నాగరాజు

గ్రామకంఠం సర్వేను వేగవంతం చేయండి

- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్

రాయచోటి : గ్రామకంఠం సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోనశశిధర్ అన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో జగనన్న పల్లె వెలుగు, జగనన్న స్వచ్ఛ సంకల్పం, వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు , భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం భూముల సర్వే, ఉపాధి హామీ, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతి తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ గిరీష పిఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించి స్వచ్ఛ గ్రామాలను తీర్చిదిద్దాలని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గ్రామ కంఠంకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలీడేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా క్షేత్రస్థాయిలో కూలీల సంఖ్యను మరింత పెంచి లక్ష్యాన్ని వందశాతం సాధించాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల్లో వేగం పెంచి గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా గ్రామకంఠం రీ సర్వేను పక్కాగా నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి - చాపాడు

ఏదైనా సాధించగలమనే నమ్మకం, పట్టుదల విద్యార్థులకు ఉండాలని టిసిఎస్ గ్లోబల్ హెడ్ చక్రవర్తి సూచించారు. స్థానిక సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన ఇంజనీరింగ్ విద్యపై అవగాహన, మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. యువత టెక్నాలజీని ఉపయోగించుకుని అభివృద్ధి వైపు నడవాలన్నారు. ఇంజనీరింగ్ విద్యపై ప్రస్తుతం విద్యార్థుల్లో ఆసక్తి పెరిగిందన్నారు. ఇంజనీరింగ్ వ్యవస్థలో వచ్చిన విప్లవత్మకమైన మార్పుల వల్ల టెక్నాలజీ ఎంతగానో పెరిగిందన్నారు. తద్వారానే కరోనా సమయంలో ప్రజలకు చాలా ఉపయోగం కలిగిందన్నారు. సెల్ ఫోన్‌లో కనుగొన్న యాప్‌ల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. టెక్నాలజీపై పట్టు సాధిస్తే మంచి అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. పలు అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం చక్రవర్తిని అభినందించారు. ఏర్పాటు చేసిన పలు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న టిసిఎస్ చక్రవర్తి

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లింగ నిర్ధారణ వెల్లడిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా డిప్యూటీ డెమో రమణమ్మ, డాక్టర్ ప్రదీప్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడబిడ్డ, మగబిడ్డ సృష్టిలో సమానమేనని తెలిపారు. భ్రూణ హత్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాయుడు, రాజశేఖర్, పద్మనాభరెడ్డి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమణమ్మ

అభివృద్ధి పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. పులివెందుల రింగ్ రోడ్డు పరిధిలో విగ్రహాల ఏర్పాటుకు సంబంధించి కోట్ల రూపాయలను దుర్వినియోగం చేస్తు న్నారని విమ ర్శించారు. ఈ ఖర్చును ఇటీవల ఉల్లి పంటతో నష్టపోయిన రైతులకు ఉపయోగపడేలా చేసి ఉంటే బాగుండేదన్నారు. ఈనెల 3న ముఖ్యమంత్రి జగన్ పులివెందుల పర్యటనలో ఎస్‌సిఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో వివాహానికి హాజరయ్యారు. ఆ సందర్భంగా తారు రోడ్డు వేశారని, ఇది ప్రయివేట్ కార్యక్రమానికి తారురోడ్డు వేయడం విడ్డూరమన్నారు. అలాగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ తరపున టిడిపి బలపరుస్తున్న బి రాంగోపాల్ రెడ్డికి గ్రాడ్యుయేట్లు మద్దతివ్వాలన్నారు. అనంతరం పులివెందుల మండల పరిధిలోని అచ్చువెల్లి గ్రామంలో మన రాష్ట్రానికి ఇదేమి కర్మ అనే కార్యక్రమంలో రవి పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రామిరెడ్డి, సింహాద్రిపురం మండల నాయకులు జోగిరెడ్డి, ఆ క్కుల గారి విజయకుమార్ రెడ్డి, పనిల్, మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సిఇ కార్యాలయం వద్ద నిరసన

నిరసన తెలుపుతున్న జెఎసి నాయకులు, కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని ఆర్‌టిపిపిలో 18 రోజుల నుండి కాంట్రాక్టు కార్మికులు, భూ నిర్వాసితులు నిరసనలు చేస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా గురువారం భోజన విరామ సమయానికి ముందు సిఇ కార్య నిర్వాహణ భవనం ముందు నినాదాలు చేశారు. దాదాపు గంటపాటు నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన తమ సమస్యను ప్రభుత్వం, ఆర్‌టిపిపి యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని జెఎసి నాయకులు, కాంట్రాక్టు నాయకులు డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలం

ప్రొద్దుటూరు : పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మెప్మా అధికారులు తెలిపారు. స్థానిక మున్సిపల్ పార్కులో గురువారం మెప్మా ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది

12 నుంచి సైన్స్ ఎగ్జిబిషన్

రాయచోటి : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నెల 12, 13 తేదీలలో జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాలలోని ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిరహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి ఓబుల్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ప్రదర్శన నిర్వహించి థీమ్‌కు ఒకటి చొప్పున ఐదు ప్రాజెక్టులను ఎంపిక చేశామని చెప్పారు.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.ఎస్ నెం : 268/2021

మితాయిగిరి సుభాహన్ భాష, తండ్రి జబ్బార్ సాహెబ్, వయస్సు 49సంలు, ముస్లిం, నివాసం డోర్ నెం : 2/18 గూడుమస్తాన్ దర్గా వీధి, జమ్మలమడుగు టౌన్, మరియు మండలం, కడప జిల్లా. ... వాది

వర్సెస్

మితాయిగిరి మాబాష @ మహబూబ్ బాష, తండ్రి ఖాజీపీర్, వయస్సు సుమారు 38 సం॥లు, నివాసం, డోర్ నెం : 19/9, రాజాజీ రోడ్, ప్రొద్దుటూర్ టౌన్ మరియు మండలం, కడప జిల్లా. ... ప్రతివాది

దావా సమను

వాది, ప్రతివాది అయిన మీపై దావా దాఖలు చేసినారు. అట్టి దావాలో మీకేమయినా ఆక్షేపణలు ఉన్న ఎడల 15.12.2022 వ తేదీన పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు హాజరయి తెలుపుకోవచ్చును. లేనంతట మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేది : 15.12.2022

బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు
వై. సూర్య పెద్ది రాజు
అద్వకేటు, జమ్మలమడుగు.